జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 9 | జులై | 2026 • పేజీలు : 6

# డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ సర్వే వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**ములకలపల్లి, జూలై 08(ప్రజా జ్యోతి):** సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో

మిగతా 2 లో...



- పొద్దు వాలితే ట్రాక్టర్లతో ఇసుక, మట్టి, తరలింపు
- సంబంధిత అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్న వైనం
- ఈ మాఫియాకు ప్రజాప్రతినిధుల అండదండలే కారణమా..?
- చోద్యం చూస్తున్న రెవిన్యూ,మైనింగ్ అధికారులు

# రెచ్చిపోతున్న మట్టి, ఇసుక మాఫియాలు

**అశ్వాపురం : జూలై 8, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా మట్టి ఇసుక,తోలకాలు రాత్రి పగలు లేకుండా మట్టి మాఫియా, ఇసుక అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు అనధికారంగా మట్టి తవ్వకాలు, ఇసుక తవ్వకాలు,సాగుతున్నాయి. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ కొందరు వ్యక్తులు యదేచ్ఛగా సాగిస్తున్న ఈ అక్రమ దందా పై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు నుంచి మట్టిని తవ్వుతూ తరలిస్తున్నారని రాత్రి వేళలో భారీ శబ్దాలతో లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు వీధులలో నుంచి వెళుతుండడంతో ప్రజలకు నిద్ర పట్టడం లేదని ఆవేదన

మిగతా 2 లో...

# ప్రాణం కాపాడిన హెల్మెట్..!



- డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడినా... తలకు రక్షణగా నిలిచిన శిరస్త్రాణం
- జరిమానా భయంతో కాదు... ప్రాణాల కోసం హెల్మెట్ ధరించండి.
- ప్రత్యక్ష ఉదాహరణతో ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 8, (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. కానీ అలాంటి ప్రమాదంలో ప్రాణాలు నిలుస్తాయా లేదా అనేది చాలా సందర్భాల్లో ఒక హెల్మెట్ నిర్ణయిస్తుంది. జిల్లాలో బుధవారం జరిగిన ఓ ప్రమాదం దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే...మధ్యాహ్నం పెద్దమ్మతల్లి గుడి నుంచి పాల్వంచ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా వాహనంపై

మిగతా 2 లో...

# 15 కిలోల ప్రెషర్ కుక్కర్ ఐఈడీ నిర్వీర్యం

**భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం**




**చర్ల, జులై 08:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో నక్సలైట్ల కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో నారాయణ్ పూర్ పోలీసులు, 53వ బెటాలియన్ ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) సంయుక్తంగా నిర్వహించిన గాలింపు ఆపరేషన్‌లో భారీగా పేలుడు పదార్థాలు, నాటు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో నక్సలైట్లు దాచిపెట్టిన నిల్వ కేంద్రాన్ని గుర్తించిన భద్రతా బలగాలు, అక్కడి నుంచి 15 కిలోల బరువున్న ప్రెషర్ కుక్కర్ ఐఈడీతో పాటు పలువురు ఉపయోగించే పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ రాబిన్సన్ గుడియా, 53వ బెటాలియన్ ఐటీబీపీ కమాండెంట్ సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో, సెకండ్ కమాండ్ సంజయ్ భరద్వాజ్ పర్యవేక్షణలో జూలై 7న అడింగ్‌పార్ క్యాంపు నుంచి అడ్స్‌మెటా గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో

మిగతా 2 లో...

# కల్తీ పుల్... ప్రజల ఆరోగ్యం చిల్లు

- కల్తీ వస్తువులతో ప్రజల జీవితాలను అంధకారంలోకి నేడుతున్న వ్యాపారులు
- నాసిరకం వస్తువులపై అధికరేట్లు వసూలు
- నిద్ర వలయంలో సంబంధిత అధికారులు
- బడాబాబు కనుసన్నల్లోనే ఈ కల్తీ దందానా?



**అశ్వాపురం, జూలై 8, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో సూపర్ మార్కెట్లు,కిరాణా షాపులు, దర్శనం. పైసా వ్యామోహంతో నిత్య అవసరాల వస్తువుల్లో కల్తీ, ప్రజల జీవితాలను అంధకారంలోకి నేడుతున్న వ్యాపారులు .ప్రస్తుత కాలంలో మనం తినే ఆహారం నిత్యావసర వస్తువులు కల్తీ అవుతున్నాయి. విపణి లో డిమాండ్

మిగతా 2 లో...

## 15 కిలోల ప్రెషర్ కుక్కర్ ఐఈడీ నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి...)

ఏరియా డామినేషన్, గాలింపు ఆపరేషన్ చేపట్టారు. అసిస్టెంట్ కమాండెంట్ ఆజాద్ సింగ్ నేతృత్వంలోని బృందంలో 34 మంది ఐటీబీపీ సిబ్బంది, నారాయణ్‌పూర్ పోలీసుల ప్రతినిధి, ఐదుగురు సభ్యులతో కూడిన బాంబు నిర్వీర్య దళం పాల్గొంది.గాలింపు సందర్భంగా అటవీ ప్రాంతంలో దాచిపెట్టిన 15 కిలోల ప్రెషర్ కుక్కర్ ఐఈడీని గుర్తించిన బాంబు నిర్వీర్య బృందం భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సంఘటనా స్థలంలోనే నియంత్రిత పేలుడు ద్వారా సురక్షితంగా నిర్వీర్యం చేసింది.ఈ ఆపరేషన్‌లో దేశీయంగా తయారు చేసిన ఒక రాకెట్ లాంచర్, 16 స్వదేశీ 51 ఎంఎం మోర్టార్ రౌండ్లు, ఐదు స్వదేశీ 84 ఎంఎం రాకెట్ లాంచర్ రౌండ్లు, పది 40×46 ఎంఎం బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ రౌండ్లు, ఎనిమిది .303 రైఫిల్ కాట్రిడ్జ్‌లు, నాలుగు టాక్టికల్ పౌచ్‌లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన అనంతరం సంయుక్త బృందం సురక్షితంగా అడింగ్‌పార్ క్యాంపుకు చేరుకుంది అని నక్సలైట్ల కదలికలను అరికట్టేందుకు ఆ ప్రాంతంలో గాలింపులు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## "కల్తీ ఫుల్," ప్రజల ఆరోగ్యం చిల్లు "

(మొదటి పేజీ తరువాయి...)

ఉన్న ప్రతి నిత్యావసర వస్తువుల పై లాభార్జనదేయంగా వ్యాపారులు కల్తీ చేస్తున్నారు. కల్తీ సరుకుల వల్ల ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. కలిసి రాకపోతే ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు ఉప్పు, పప్పు కాలికి వేసుకుని చెప్పుల నుండి పసిపిల్లలు పాల పొడి వ్యాధిగ్రస్తులు వేసుకునే మందుల వరకు కల్తీ చేసే కల్తీ రాయుళ్లు. ఒకప్పుడు తినే వస్తువుల్లో కల్తీ చేసే వాళ్ళు ఇప్పుడు ఆధునిక సంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని కల్తి చేస్తున్నారు. ఖరీదైన వంట నూనెలలో తక్కువ ఖరీదు గల నూనెను కలిపి కల్తీ చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారుడికి పూర్తిస్థాయిలో అనారోగ్యం కలగ పోయినప్పటికీ ఆర్థికంగా కృంగిపోతున్నాడు.తెలివిగా నాణ్యమైన సరుకుల్లో నాణ్యతలేని సరుకులు కలిపి కల్తీ చేస్తున్నారు. కల్తీరాయళ్లు తెలివి నాణ్యత లోపించిన, విడిగా అమ్ముడుపోని పుచ్చ సచ్చు పప్పు సైతం ఇందులో వేసి పిండి చేసి రంగు కలిపి ఆకర్షణంగా చేసి అమ్మేస్తున్నారు.

## డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ సర్వే వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతున్న భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ములకలపల్లి గ్రామ పరిధిలో మొత్తం 160 ఎకరాల్లో భూసర్వే చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 22 ఎకరాల్లో సర్వే పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన సర్వేను నిర్ణీత గడువులో ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.సర్వే సందర్భంగా భూ యజమానుల వివరాలతో పాటు బోర్లు, సాగులో ఉన్న పంటలు, ఆయిల్‌పామ్ తోటలు, ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి తహసీల్దార్ స్వాతి బిందు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు అడపా లచ్చయ్య దొర కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల



**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి ):** దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు అడపా లచ్చయ్య దొర కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల లచ్చయ్య దొర మాతృమూర్తి స్వర్గీయ అడపా పుష్పవతి మరణించిన విషయం తెలుసుకున్న మంత్రి, వారి నివాసానికి చేరుకుని పుష్పవతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అడపా లచ్చయ్య దొరతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పుష్పవతి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ తన సంతాపాన్ని తెలియజేశారు. మంత్రి వెంట దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రెచ్చిపోతున్న మట్టి, ఇసుక మాఫియాలు

(మొదటి పేజీ తరువాయి...)



వ్యక్తం చేస్తున్నారు. కానీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనికి కారణం మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల కొందరు అధికార పార్టీల బడా బాబుల అండదండలతో స్థానిక గుట్టలను, చెరువుల మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము తీసుకుంటున్నారని, గతంలో పత్రికల ద్వారా ఎన్నోసార్లు సమాచారాన్ని తెలియజేసినా సంబంధిత అధికారులకు నిద్ర మత్తులో ఉన్నట్లు తెలుస్తుందని మండల ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. ఈ మట్టి దందా వల్ల ప్రభుత్వ ఖజానా గండి పడడమే కాకుండా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని, ఈ అక్రమ తవ్వకాలపై అధికారులు అప్పుడప్పుడు కేసు నమోదు చేసినా ఈ దందా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వి 1500 నుంచి 2500 రూపాయల వరకు విక్రయిస్తున్నారని, ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ప్రతిరోజు సాయంత్రం సూర్యుడు అస్తమించగానే మట్టి మాఫియాకు రెక్కలు వస్తాయి. సాయంత్రం ఐదు అయితే మట్టి ఇసుక, మాఫియాకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేపడుతూ ఉంటే ఆయా శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం. ఇంత మట్టి, ఇసుక, తవ్వకాలు చేపట్టి తవ్వుతుంటే అధికారులు చూడనట్లుగా పోతున్నారు వాస్తవంగా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ, మైనింగ్,అనుమతితో పాటు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి, ఇసుక, తవ్వుతూ దర్జాగా తరలిస్తున్నారు అంటే అన్ని శాఖల అధికారులు మట్టి, ఇసుక, మాఫియా తో కుమ్మక్కై,ఈ దందా నీ నడిపిస్తున్నారని మండల ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా మట్టి, ఇసుక మాఫియా అక్రమ రవాణాపై నిఘా ఉంచి ప్రభుత్వ సంపాదన కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## ప్రాణం కాపాడిన హెల్మెట్..!

(మొదటి పేజీ తరువాయి...)



నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఢీకొట్టిన వేగానికి రోడ్డుకు అవతలి వైపు ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం తీవ్రతను చూసిన స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే ఆ ప్రమాదంలో అతని ప్రాణాలను కాపాడింది ఒక్కటే... అతను ధరించిన హెల్మెట్. రోడ్డుపై పడిన సమయంలో తల బలంగా నేలను తాకినా, ఆ దెబ్బను హెల్మెట్ తట్టుకుంది. దీంతో తలకు తీవ్ర గాయాలు కాకుండా తప్పించుకున్నాడు. హెల్మెట్ లేకపోయి ఉంటే ఈ ప్రమాదం ప్రాణాంతకంగా మారేదని అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగినా, హెల్మెట్ ధరించడం వల్లే ప్రాణాపాయం తప్పిందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

### జరిమానా కోసం కాదు... ప్రాణాల కోసం

ఈ ఘటన ప్రతి ద్విచక్ర వాహనదారికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. చాలా మంది హెల్మెట్‌ను ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తారనే భయంతో మాత్రమే ధరిస్తుంటారు. కానీ హెల్మెట్ అసలు అవసరం జరిమానా తప్పించుకోవడానికి కాదు... మన ప్రాణాలను, మన కుటుంబాన్ని కాపాడుకోవడానికి.

చిన్న దూరమైనా, నెమ్మదిగా వెళ్తున్నా ప్రమాదం ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేరు. కానీ ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే మొదటి రక్షణ హెల్మెట్ మాత్రమే. బైక్‌పై ఎక్కే ముందు కీ తిప్పడం ఎంత అవసరమో... హెల్మెట్ ధరించడం అంతకంటే అవసరం. ఒక హెల్మెట్... ఒక ప్రాణాన్ని మాత్రమే కాదు, ఒక కుటుంబానికి ఆధారమైన మనిషిని కూడా కాపాడుతుంది.

# మద్యం మత్తులో లారీ నడపడంతో ప్రమాదం..? మరో లారీ ధ్వంసం

### విద్యుత్ శాఖకు రూ.15 వేల నష్టం.. ట్రాఫిక్‌కు అంతరాయం






**టేకులపల్లి, జూలై 09,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల పరిధిలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక లారీ మరో లారీని ఢీకొనడంతో లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో వాహనాలకు భారీ నష్టం వాటిల్లగా, కొంతసేపు ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల కథనం ప్రకారం, టీజీ26టీ4509 నంబర్ గల లారీని డ్రైవర్ బానోత్ హరినాథ్ మద్యం మత్తులో నడపడం వల్ల రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఏపీ20టీబీ7976 నంబర్ గల లారీని ఢీకొట్టినట్లు వారు ఆరోపించారు. ప్రమాదం ధాటికి నిలిపి ఉన్న లారీ ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అయితే, డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడనే అంశంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.ప్రమాద సమయంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు కూడా దెబ్బతినడంతో విద్యుత్ శాఖకు సుమారు రూ.15 వేల మేర నష్టం వాటిల్లినట్లు స్థానిక లైన్‌మన్ తెలిపారు. ఈ ఘటన కారణంగా కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదంలో దెబ్బతిన్న లారీ యజమాని రాజ్ కుమార్ తన వాహనం పూర్తిగా ధ్వంసం కావడంతో తీవ్ర ఆవేదనకు గురై, అయోమయ పరిస్థితిలో కన్నీటి పర్యంతమయ్యారని స్థానికులు తెలిపారు. ప్రమాదంతో తనకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.సమాచారం అందుకున్న టేకులపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.ప్రమాదానికి గల అసలు కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.లారీ డ్రైవర్ బానోత్ హరినాథ్‌ను అదుపులోకి తీసుకుని టేకులపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

# మీసేవ కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

- **అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**బూర్గంపహాడ్,జూలై8,(ప్రజా జ్యోతి):** మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి కేంద్రంలో కచ్చితంగా అమలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు.బుధవారం బూర్గంపహాడ్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ కేంద్రాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మీసేవ కేంద్రాలు నిర్ణయించిన పని వేళలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దరఖాస్తుదారుల నుంచి అవసరం లేని భౌతిక పత్రాలను మండల రెవెన్యూ కార్యాలయాలు కోరకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ రసీదుల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కాగితపు రసీదులకు బదులుగా దరఖాస్తుదారుల మొబైల్‌కు రసీదు సందేశం పంపించి, అవసరమైతే ఈ-ప్రింట్ సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుములకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు వసూలు చేయరాదని హెచ్చరించారు. దరఖాస్తులకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను మాత్రమే అప్లోడ్ చేయాలని, ప్రతి పత్రాన్ని స్పష్టంగా స్కాన్ చేసి నాణ్యతతో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి మీసేవ కేంద్రంలో రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తారని, వారితో మర్యాదపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకత, బాధ్యతతో సేవలు అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్,మండలంలోని జీపీఓలు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మీసేవ కేంద్రాల వీఎల్ఈలు,ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు , జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# వైయస్సార్ జయంతి వేడుకలు



**ఇల్లందు, జులై 8 (ప్రజా జ్యోతి)** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి, జగదాంబ సెంటర్ లోని వైయస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము లు పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైయస్సార్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువ లేనివని కొనియాడారు. ముఖ్యమంత్రిగా వైయస్సార్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమ్ములు చేసి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైయస్సార్ ఎంతో సేవ చేశారని, మరలా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తతే రక్షణ

- **మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు**



**చర్ల, జులై 08: (ప్రజా జ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం మండలంలోని మలేరియా ప్రభావిత మారుమూల గ్రామాలైన రాళ్లపురం, ఉయ్యాలమడుగులో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. హారిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాల్లో గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మొత్తం 46 మంది వైద్య సేవలు పొందారు.ఈ సందర్భంగా డా. హారిక మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తాగునీటిని తప్పనిసరిగా మరిగించి చల్లార్చిన తర్వాతే ఉపయోగించాలని తెలిపారు.అలాగే ఆహార పదార్థాలను మూతపెట్టి ఉంచడంతో పాటు వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లల్లో అలర్జీ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నందున వారికి రోజుకు రెండు పూటలా వేడి చేసి చల్లార్చిన నీటితో స్నానం చేయించాలని వాగులు, చెరువుల్లో నిల్వ ఉండే కొత్త నీటిలో స్నానం చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ ఆరోగ్య శిబిరంలో హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, హెల్త్ ప్రొవైడర్ తులసి, హెల్త్ అసిస్టెంట్లు ధర్మారావు, స్వరూప, ఆశా కార్యకర్తలు భద్రమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జననేత వైఎస్సార్ కు ఘన నివాళులు



**చర్ల, జులై 08 (ప్రజా జ్యోతి ):** మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా చర్ల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన ప్రజాసేవలను కొనియాడారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన మహానేతగా వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు . రైతు బాంధవుడిగా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడిగా ఆయన అని అన్నారు.ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప్పరగూడెం గ్రామ సర్పంచ్ సావిత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సుందర సురేష్, ఆవుల శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, జవ్వాది రవి, మేడిచర్ల కుమార్, ఇస్తా నాగభూషణం, అలవాల బాలు, మునిగల సాగర్, మాటూరు సాంబశివరావు, బొమ్మ వీరరాఘవయ్య, పూజారి రమణయ్య, బొమ్మల సుదీర్, ఇసంపల్లి రమేష్‌తో పాటు కొత్తపల్లి, చిన్న మెస్సులేరు, పెద్ద మెస్సులేరు గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమాన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- **జూలై 15 వరకు అవకాశం ... నిరుద్యోగ యువత వినియోగించుకోవాలన్న ఎంపీడీఓ సంకీర్త్**



**పినపాక,జులై 08(ప్రజాజ్యోతి):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సంకీర్త్ తెలిపారు. బుధవారం అయన ఎంపీడీఓ కార్యాలయంలొ మాట్లాడారు.ఈ శిక్షణల్లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీ థెరపిస్ట్, వేర్‌హౌస్ సూపర్‌వైజర్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్ (ఎలక్ట్రికల్), జనరల్ డ్యూటీ అసిస్టెంట్, సోలార్ పంప్ టెక్నీషియన్, మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కేంద్రాలు భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేటలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు జూలై 15, 2026లోగా పినపాక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79931 02529 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



**చర్ల, జులై 08: (ప్రజా జ్యోతి ):** మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు నేతృత్వంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోడి చలపతి, ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కారంపూడి సాల్మన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన మహానేత అని పేదల అభ్యున్నతి కోసం ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ప్రజాసేవను రాజకీయాలకు పరమావధిగా భావించిన నాయకుడిగా వైఎస్సార్ ను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని అన్నారు.టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుంజ నాగేశ్వరావు, మడకం పద్మ, కట్ట అమ్మాజీ, సర్పంచ్ జోగా లక్ష్మి, మాజీ సర్పంచ్ సరేం రాధ, మాజీ ఉపసర్పంచ్ శివ, ఉపసర్పంచ్ కాపుల కృష్ణ, తాండవ రాయుడు, మనోహర్, బిక్షపతి, గంగరాజు, సోషల్ మీడియా ఇన్ చార్జి రూంజా రాజ్, రజిని, మేడ బత్తిన వాసు, గుండ్ల రంజిత్, పరవా శంకర్, కౌశిక్, వంశీ, రమేష్, రామారావు, గుడపాటి రంజిత్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దంతెలబోరలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు





**పాల్వంచ, జూలై 8, ప్రజాజ్యోతి:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను పాల్వంచ మండలం దంతెలబోర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగిరెడ్డి భువన్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ, వైఎస్సార్ తన పాలనలో పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజాపాలనను మరింత బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు బోనస్ వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని ఆమె తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిరెడ్డి భువన్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ పాలన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఆయన పాలనలో అమలయ్యాయని గుర్తు చేశారు. పార్టీ పరిశీలకులు లింగోజీ మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రజాహిత పరిపాలనకు ఆదర్శమని కొనియాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అలాగే ఓటరు జాబితాలో పేరు లేని వారు తప్పకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలన అంటేనే ప్రజాపాలనకు ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్దబాబు, శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం టౌన్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్, మెంటం రాము, పెద్దమ్మగుడి డైరెక్టర్ పాపారావు, సర్పంచులు, గ్రామ నాయకులు, దంతెలబోర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా విడుదలపై సీఎంకు పాలాభిషేకం



**చర్ల, జులై 08:(ప్రజా జ్యోతి ):** రైతు భరోసా పథకం కింద రాష్ట్ర రైతులకు రూ.9,000కోట్ల పెట్టుబడి సాయాన్ని సకాలంలో విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. అలాగే పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని అభినందించారు. రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజా అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోడి చలపతి, ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కారంపూడి సాల్మన్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎన్ హెచ్ఎం డిప్యూటీ రీజినల్ డైరెక్టర్



**బూర్గంపహాడ్, జూలై 8 (ప్రజా జ్యోతి):** మండలంలోని మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ హెచ్ఎం) డిప్యూటీ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ వరుణ్, కేంద్ర కమిటీ సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్సీలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, రక్తపోటు, మధుమేహం, మలేరియా, డెంగ్యూ వచ్చిన వారికీ అందు తున్న వైద్య సేవల గురించి పిహెచ్సీ డాక్టర్ నగేష్ అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగ్యూ రాకుండా ముందు జాగ్రత్తగా తీసుకుంటున్న చర్యలు, ఇంటింటి సందర్శన, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, మండల, గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం గురించి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఏపిఎం లక్ష్మీపురం, బేకులచెరువు సబ్ సెంటర్ లను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా సంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ దినేష్, జిల్లా ఎన్ హెచ్ఎం ప్రోగ్రామ్ అధికారి సలిత, జిల్లా అదనపు మలేరియా నివారణ అధికారి గొంది. వెంకటేశ్వర్లు, డిపిఎంఓ శ్రీనివాసరావు, హెచ్ఈఓ రాంప్రసాద్, పిహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ఫామ్ లను జాగ్రత్తగా పూర్తి చేయాలి



**ఇల్లందు, జులై 8 (ప్రజా జ్యోతి)** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఫామ్ లను జాగ్రత్తగా పూర్తి చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ దందు సారయ్య కోరారు. బుధవారం కౌన్సిలర్ స్వగృహంలో బిఎల్ఓ, బిఎల్ఏ లతో మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని ఎవరి ఓటు పోకుండా చూడాలన్నారు. బిఎల్ఓ, బిఎల్ఏ లు ప్రతి ఓటు ను తప్పనిసరిగా గమనించాలని, సర్ ఫామ్ తప్పులు లేకుండా నింపాలని సూచించారు. ముందుగా ఫామ్ లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే ఆ ఫామ్ ను పూర్తి చేయాలని కోరారు. చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో ఇబ్బంది కావద్దని, ప్రతి ఒక్క ఓటరు కు అన్యాయం జరగవద్దని పేర్కొన్నారు. ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ, బిఎల్ఏ లు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా గోలి సదాశివ నియామకం



**పాల్వంచ, జులై 8,(ప్రజాజ్యోతి):** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం కమిటీని పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ గద్దల రమేష్ జిల్లా, మండల స్థాయి అధ్యక్షులను నియమించారు. ఈ సందర్భంగా పాల్వంచ టౌన్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా గోలి సదాశివను నియమించినట్లు గద్దల రమేష్ వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న గోలి సదాశివ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేస్తూ కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, రాష్ట్ర మంత్రులకు, టీపీసీసీ నాయకులకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ గద్దల రమేష్‌కు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు గోలి సదాశివ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ఎస్పీ కలిసిన కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్. రావు



**పాల్వంచ, జూలై 8, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) రోహిత్ రాజు, ఐపీఎస్‌ను డాక్టర్ బి.ఎస్. రావు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇద్దరూ పరస్పరం ఆత్మీయంగా అభివాదాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించినట్లు సమాచారం. ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను డాక్టర్ బి.ఎస్. రావు అభినందించారు. అనంతరం డాక్టర్ బి.ఎస్. రావు జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి జ్ఞాపకార్థంగా ఫోటో దిగారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## మందలపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే జారే జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని దమ్మపేట మండలం మందలపల్లిలో కాంగ్రెస్ నాయకులు పర్వతనేని వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసిన నాయకులు, ఒకరికి ఒకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజల ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ కమిటీ సభ్యులు సోంగ యేసుమణి, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాకా రమేష్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు, మందలపల్లి సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చింతలపాటి మురళి, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు అడపా పోలరావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని వరప్రసాద్ రావు, అనుమోలు సత్యబాబు, చిన్నంశెట్టి గోపి, మడకం రాజేష్, పార్కలగండి మాజీ సర్పంచ్ కోర్సా సాగర్, పొట్లూరి ప్రవీణ్, సుగసాని శ్రీధర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు వాసం నవ్య, మానికల సుబ్బారావు, దమ్మపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ అహ్మద్ రషీద్, మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, మహిళా మండలి సభ్యులు భారతి, నాగమణితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# ఆమ్ బజార్ మున్సిపాలిటీలో లేదా...?

- డ్రైనేజీలపై దర్జాగా వ్యాపారాలు!
- అధికారుల మౌనం ఎందుకో?
- గతంలోనే నోటీసులు జారీ!
- ఇప్పటివరకు చర్యలు శూన్యం!
- చిరు వ్యాపారులపై వెంటనే చర్యలా?
- బడా వ్యాపారులపై ఎందుకు మౌనం?
- మున్సిపల్ చట్టం అందరికీ సమానంగా అమలు ఎక్కడ?
- డ్రైనేజీల ఆక్రమణలతో పారిశుద్ధ్యానికి ముప్పు!
- ఉన్నతాధికారులు స్పందించరూ!
- ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై చేసే వ్యాపారాలకు కళ్లెం వేయరూ!





**ఇల్లందు, జులై 8 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలోని ఆమ్ బజార్‌లో డ్రైనేజీలపై వ్యాపారాలు, శాశ్వత నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఇప్పటికీ సమర్థవంతమైన చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన డ్రైనేజీలు ప్రస్తుతం వ్యాపార కేంద్రాలుగా మారిపోవడంతో వర్షాకాలంలో మురుగునీటి పారుదల వ్యవస్థ దెబ్బ తింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలపై నిర్మాణాలు ఉండటంతో శుభ్రపరిచే పనులు కూడా సక్రమంగా చేపట్టలేని పరిస్థితి నెలకొంది. కాగా కొన్ని ఏళ్ల నుంచి ఆమ్ బజార్ లో పలు రకాల వ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు. డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాలు చేపట్టడం వల్ల నిత్యం రద్దీ ఉండే ఆమ్ బజార్ లో వివిధ రకాల వాహనాలు, ఇటు ద్విచక్ర వాహనాలు, జనం సంచరించడం వల్ల ఎక్కువ సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా డ్రైనేజీలపైనే కాకుండా రోడ్డుపై కూడా వస్తువులు ఉంచడం విశేషం. ఇలా తమను ఎవరు ఏమి చేయలేరని.. ప్రశ్నించే వారే లేరనే ధీమాలో ఆమ్ బజార్ లో వ్యాపారం కొనసాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరి ముఖ్యంగా డ్రైనేజీలను శుభ్రం చేసే పరిస్థితి సైతం ఆమ్ బజార్ లో కనిపించడం లేదని, దానివల్ల ప్రజల ఆరోగ్యానికి హాని జరిగే అవకాశం లేకపోలేదని ప్రజలు అంటున్నారు

### ››› నోటీసులు కేవలం హెచ్చరికలకే పరిమితమయ్యాయా..?

ఆమ్ బజార్ డ్రైనేజీలపై వ్యాపారాలు, నిర్మాణాల విషయంలో గతంలోనే మున్సిపల్ అధికారులు ఆమ్ బజార్ వ్యాపారులకు నోటీసులు జారీ చేసి డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరినట్లు సమాచారం. అయితే నెలలు గడుస్తున్నా క్షేత్ర స్థాయిలో ఎలాంటి చర్యలు కనిపించకపోవడంతో నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఎందుకు వెనక్కి తగ్గుతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ››› చిన్న వ్యాపారులకు ఒక తీరు... బడా వ్యాపారులకు మరో తీరు..?

ఇల్లందు మున్సిపల్ పరిధిలో చిన్న చిన్న వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, బడా వ్యాపారుల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎవరి ఒత్తిళ్ల కారణంగానే అధికారులు వెనుకడుగు వేస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ చట్టం అందరికీ సమానంగా వర్తించాలే గానీ ఎంపిక చేసిన వారిపైనే అమలు చేయకూడదని ప్రజలు కోరుతున్నారు.

### ››› డ్రైనేజీల ఆక్రమణలతో పెరుగుతున్న పారిశుద్ధ్య సమస్యలు

ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై నిర్మాణాలు, వ్యాపారాలు కొనసాగడం వల్ల మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో నీరు నిల్వ ఉండడం, దుర్వాసన వ్యాపించడం, దోమల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు. డ్రైనేజీల మరమ్మతులు, శుభ్రపరిచే పనులు నిర్వహించేందుకు కూడా సిబ్బంది ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వచ్చే అవకాశం లేకపోలేదు.

### ››› మున్సిపల్ చట్టం అందరికీ సమానమే కాదా..?

ప్రజా స్థలాలు, డ్రైనేజీలపై ఆక్రమణలు నిషేధమని మున్సిపల్ చట్టాలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ ఆమ్ బజార్‌లో మాత్రం అవి అమలు కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. చట్టాన్ని ఎలాంటి వివక్ష లేకుండా అమలు చేయాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### ››› ఉన్నతాధికారులు స్పందించరూ!

ఆమ్ బజార్‌లో డ్రైనేజీలపై కొనసాగుతున్న వ్యాపారాలు, ఆక్రమణలపై జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని డ్రైనేజీలను ఆక్రమణలు కాకుండా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్.. గణేష్‌పాడు పాఠశాల వద్ద కంకర తొలగింపు

వార్తకు స్పందించిన అధికారులు..

- శిథిల ప్రహరీ గోడ పక్కనున్న కంకర తొలగింపు
- కొత్త ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి










**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం గణేష్‌పాడు ప్రభుత్వ పాఠశాల వద్ద శిథిలావస్థకు చేరుకున్న ప్రహరీ గోడకు ఆనుకుని కంకరను పోయడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందంటూ ప్రజాజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన సంబంధిత శాఖ అధికారులు యంత్రాంగాన్ని రంగంలోకి దించి, ప్రహరీ గోడ పక్కన పేరుకుపోయిన కంకరను పూర్తి స్థాయిలో తొలగించారు. ఒక చిన్న రాయి కూడా మిగలకుండా మొత్తం కంకరను తొలగించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజాజ్యోతి కథనం ఫలితంగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడం పట్ల పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పాత ప్రహరీ గోడ ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆ గోడను తొలగించి, దాని స్థానంలో బలమైన నూతన ప్రహరీ గోడను నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. పాఠశాల పరిసరాల్లో శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళి

- ఎమ్మెల్యే జారే జన్మదిన వేడుకలు వైభవంగా
- దమ్మపేటలో కాంగ్రెస్ శ్రేణుల సందడి
- రైతు భరోసాపై పాలాభిషేకాలు – రక్తదాన శిబిరంలో సేవాస్ఫూర్తి









**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల కేంద్రం బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సందడితో మార్మోగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రజానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు, ఆయన రైతు, పేదల సంక్షేమం కోసం అమలు చేసిన చారిత్రాత్మక పథకాలను స్మరించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ సేవలను కొనియాడారు.ఆ తర్వాత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. "జై జారే... జై జై జారే", "హ్యాపీ బర్త్‌డే టు జారే", "జారే నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ కార్యకర్తల నినాదాలతో దమ్మపేట మార్మోగింది. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ "జై కాంగ్రెస్", "రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి", "తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక వినాయక ఫంక్షన్ హాల్‌లో యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పోదిలి జ్యోతి, చీకటి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కక్కిరాల రమేష్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కె.వి. సత్యనారాయణ, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, పర్వతనేని ప్రసాద్, పగడాల రాంబాబు, అత్తులూరి వెంకట రామారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "రక్తదానం మహాదానం" అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఇబ్బంది పడుతున్న వారికి ఇటువంటి శిబిరాలు ప్రాణదాతలుగా నిలుస్తాయని, ప్రతి ఆరోగ్యవంతుడు ఏడాదికి కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు సైతం ఉత్సాహంగా రక్తదానం చేసి శిబిరం విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. శిబిరంలో 30 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ కార్యక్రమాల్లో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాకా రమేష్, కొవ్వలి వినోద్ కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ పగడాల కృష్ణారావు, చిన్నశెట్టి గోపి, కందుల వెంకటేశ్వరరావు, తాళ్ల శంకర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, చక్రాల మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్, వనమాల శ్రీనివాసరావు, చిలకా శ్రీను, సర్పంచులు గుజ్జుల శ్రీనివాసరావు, కూరం అర్జునరావు, ఉపసర్పంచులు ఆంగోతు శ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, చింతలపాటి మురళి, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చాట్ల శ్రీను, పిట్టల శ్రీనివాసరావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, వేముల శ్రీను, అన్నవరపు నాగేంద్రరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జెట్టి వెంకటేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## పొదుపే భవిష్యత్‌కు భరోసా

- పోస్టాఫీస్ పథకాలపై ప్రజలకు అవగాహన



**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు పోస్టాఫీస్ అందిస్తున్న వివిధ సేవలు, పొదుపు పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాల్వంచ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ మాలోత్ వీరన్న ముఖ్య అతిథిగా హాజరై పోస్టాఫీస్ సేవల ప్రాధాన్యాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తపాలా శాఖ కేవలం ఉత్తరాల పంపిణీకే పరిమితం కాకుండా, ప్రజలకు అనేక రకాల పొదుపు, బీమా, బ్యాంకింగ్ సేవలను విశ్వసనీయంగా అందిస్తోందన్నారు. పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ), టైమ్ డిపాజిట్ (టీడీ), మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎంఐఎస్), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్సీఎస్ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎలఐ) వంటి పథకాల ద్వారా భద్రంగా పెట్టుబడులు పెట్టి మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు.అదేవిధంగా ఆధార్ సేవలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలు, నగదు లావాదేవీలు, మనీ ట్రాన్స్‌ఫర్, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్ వంటి అనేక సేవలు పోస్టాఫీస్ ద్వారా సులభంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని పొదుపు అలవాటు పెంపొందించుకోవడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ చాప రాఘవయ్య, పంచాయతీ కార్యదర్శి మాలోత్ రాంబాబు, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ టి. గిరిబాబు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎన్. శ్రీను, పోస్టాఫీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహానేత వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

- వైఎస్సార్ ఆశయాలే మా స్ఫూర్తి
- ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతలచెరువు వెంకట్



**దమ్మపేట, జూలై 8(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన ప్రజాసేవను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిర్నేని వెంకయ్య, దమ్మపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చిలక శ్రీను, దళిత నాయకుడు కొలికిపోగు క్రాంతికుమార్, డేరంగుల శివ, దారా రంగారావు, బ్రహ్మం శ్రీను, మెకానిక్ రాజు, చిలక సురేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దమ్మపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతలచెరువు వెంకట్ మాట్లాడుతూ, మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన సాగించి, పేదవాడి గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడు వైఎస్సార్ అని అన్నారు.

# జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతులకు అవగాహన







- నర్సాపురంలో రైతులకు శిక్షణ
- అన్నపురెడ్డిపల్లిలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

**అన్నపురెడ్డిపల్లి, జూలై 8 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని నర్సాపురం గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, సేంద్రియ సాగు ప్రయోజనాలు, పంటల మార్పిడి, భూసార పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, జీవామృతం, అజోల్లా, బయోచార్, నీటి సంరక్షణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయాన్ని కనీసం ఒక ఎకరంలో మూడు సంవత్సరాల పాటు అమలు చేస్తే సేంద్రియ ధ్రువీకరణతో పాటు పంటలకు ప్రీమియం ధర లభించే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు.శిక్షణ అనంతరం అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు రవికుమార్ గ్రామంలోని జిలుగు, వరి నాట్లు, డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేసిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్యారాణి, ఆత్మ కమిటీ సహ అధ్యక్షుడు దుబ్బాకుల రాము, నర్సాపురం ఉపసర్పంచ్ నర్సారెడ్డి, రైతులు శ్రీనివాసరెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటప్రసాద్ రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, లీలకుమార్ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, అన్నపురెడ్డిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ లాకావత్ లక్ష్మి , ఉపసర్పంచ్ మారగాని అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## అన్నపురెడ్డిపల్లి మండలం వ్యాప్తంగా జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలు

- అన్ని గ్రామపంచాయతీల్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 8 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలను అన్నపురెడ్డిపల్లి మండలం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ తమ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స వెంకట్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వనమా గాంధీ, కాంగ్రెస్ యువజన నాయకుడు, పెద్దిరెడ్డిగూడెం ఉపసర్పంచ్ వేముల నరేష్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు వేముల రమణ, వీరబోయిన నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బోడ పద్మ, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం వైస్ చైర్మన్ గుజ్జా పూర్ణ, మరకాల లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, దారావత్ వెంకటేశ్వర్లు, ఇనపనూరి జమలయ్య, చింతం నరసింహారావు, గుగులోత్ సాయిరాం, వడ్డెబోయిన చెన్నారావు, చల్ల వెంకట్రావు, లాలు, సిద్దెల నవీన్, సిద్దెల వెంకటేష్, బడుగు ముత్తయ్య, లాకావత్ రాజు, మాయర కృష్ణ తదితరులు ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.

## ఓటర్ల వివరాల నమోదు పారదర్శకంగా సాగాలి

- అన్నపురెడ్డిపల్లిలో ఎస్ఐఆర్ పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**అన్నపురెడ్డిపల్లి, జూలై 8 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ నెం.79ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సందర్శించి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, పూర్తి పారదర్శకతతో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.గైర్హాజరైన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినవారు, మరణించిన ఓటర్ల వివరాలను ప్రత్యేక జాబితాల రూపంలో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన అనంతరం మాత్రమే సేకరించిన దరఖాస్తుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, ధృవీకరించని లేదా అసంపూర్ణ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్‌లోడ్ చేయరాదని స్పష్టం చేశారు.పోలింగ్ స్టేషన్ నెం.79 పరిధిలో మొత్తం 1,012 దరఖాస్తు ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటివరకు 128 దరఖాస్తుల వివరాలను యాప్‌లో నమోదు చేసినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ధృవీకరించిన అనంతరమే యాప్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారా, అవసరమైన దరఖాస్తులు స్వీకరిస్తున్నారా, ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు సకాలంలో పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



